సాక్షి ఆదిలాబాద్

సోమవారం ; 13 ; మార్చి ; 2023



'గురుకులం'లో ప్రవేశాలు

గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 16వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 8లో ▸



అన్నాబావుసాఠె ఆదర్శప్రాయుడు

నార్నూర్ మండల కేంద్రంలో అన్నాబావు సాఠె విగ్రహాన్ని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ఆవిష్కరించారు. ఆయన ఆదర్శప్రాయుడని కొనియాడారు. 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.4/21.1

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. గాలిలో తేమ తగ్గుతుంది. మధ్యాహ్నం వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి ఉండదు.

న్యూస్‌రీల్

ఏఆర్ పోలీసుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో ఏఆర్ కానిస్టేబుళ్లు

ఆదిలాబాద్‌టౌన్: విధి నిర్వహణలో బిజీగా ఉండే పోలీసులు ఆదివారం సరదాగా గడిపారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ పోలీస్ కానిస్టేబుళ్లు జిల్లా కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒక్కచోట ఉద్యోగ శిక్షణ పొందినవారంతా విధి నిర్వహణలో భాగంగా ఎక్కడెక్కడో పని చేస్తున్నారు. వారంతా ఒక్క చోట కలిశారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. శిక్షణ కాలం నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అద్యంతం సరదాగా గడిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ



ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న డీఎం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు డీఎం కల్పన ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమంపై సంస్థ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని చెప్పారు. ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఆదేశాల మేరకు వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రతిరోజూ మధ్యాహ్నం ఉద్యోగులందరికీ మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. అసిస్టెంట్ మేనేజర్ (మెకానికల్) సీ రాజేందర్ తదితరులున్నారు.

బ్రిడ్జి కుంగినా పట్టించుకోరా?



ప్రయాణికులతో మాట్లాడుతున్న శంకర్

జైనథ్: తరోడ బ్రిడ్జి కుంగిపోవడంతో రాకపోకలు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఎమ్మెల్యే జోగు రామన్న పట్టించుకోకపోవడం బాధాకరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండలంలోని తరోడ గ్రామ సమీపంలో ప్రయాణికులతో మాట్లాడారు. వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. వంతెన కింది నుంచి తాత్కాలిక రోడ్డు నిర్మించినా వందల సంఖ్యలో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి ప్రజల రవాణా కష్టాలు తీర్చాలని, అప్పటివరకు ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు గజానన్, రత్నాకర్ రెడ్డి, ముకుంద్ తదితరులున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ



వంటలను పరిశీలిస్తున్న దుర్గారాణి

ఉట్నూర్‌రూరల్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వుల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టీ దుర్గారాణి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆదివారం తనిఖీ చేశారు. తరగతి గదులు, వంట గదులు, తాగునీటి వసతులను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ప్రతీ విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. పలు విషయాలపై విద్యార్థులకు సలహాలు, సూచనలు చేశారు.



సెల్ఫ్ సెంటర్లు..!

- ఈ నెల 15నుంచి ఇంటర్ పరీక్షలు
- చదివిన కాలేజీల్లోనే పరీక్ష కేంద్రాలు
- ఎక్కడి సిబ్బందికే అక్కడే విధులు
- ఇంటర్ బోర్డు అధికారుల ఇష్టారాజ్యం..!
- 'ప్రైవేట్' యాజమాన్యాల మాయాజాలం..!
- ఏటా జోరుగా మాస్‌కాపీయింగ్..!

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు సీనియర్లకు కాకుండా జూనియర్లకు సీఎస్‌లు, డీవోలుగా విధులు కేటాయించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కావాలనే కొంతమంది లెక్చరర్లు కాపీయింగ్‌ను ప్రోత్సహించేందుకు అనారోగ్యం పేరిట సీఎస్, డీవో విధులు కాకుండా ఇన్విజిలేటర్ విధులు నిర్వర్తించేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. కొందరికీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో భాగస్వామ్యం ఉండడంతో విద్యార్థులను మాస్‌కాపీయింగ్‌కు ప్రోత్సహించి వారి కాలేజీల్లోనే చేర్పించుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయనే చర్చ జరుగుతోంది. ఏడాదిపాటు పాఠాలు బోధించిన లెక్చరర్లలో కొంతమంది దగ్గరుండి మరీ మాస్‌కాపీయింగ్‌ను ప్రోత్సహించేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. ఫలితాలు పెంచుకోవాలనే ఉద్దేశంతో కొన్ని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాయనే విమర్శలున్నాయి. తమ కళాశాలల్లో చదివే విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు శత విధాలుగా యత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

రెన్యూవల్ భయంతో కాంట్రాక్ట్ లెక్చరర్లు

జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో అత్యధిక శాతం కాంట్రాక్ట్ లెక్చరర్లే పని చేస్తున్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం తగ్గితే కాంట్రాక్ట్ లెక్చరర్ల రెన్యూవల్ నిలిపివేస్తారనే భయంతో చాలామంది విద్యార్థుల దగ్గరుండి చూచిరాతలకు ప్రోత్సహిస్తున్నారని సమాచారం. జిల్లా ఫలితాలను బట్టి సంబంధిత సబ్జెక్టలలో అంతే శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కానట్లయితే గతంలో ఇంటర్ బోర్డు వారిపై చర్యలకు పూనుకుంది. అప్పటినుంచి కొంతమంది కాంట్రాక్ట్ లెక్చరర్లు ఈ పరీక్షలను చూసీచూడనట్లుగా వదిలేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కొంతమంది అధికారులు, సంబంధిత కళాశాలల పరీక్షల నిర్వాహకులు, ఇన్విజిలేటర్లకు తాయిలాలు అందించడంతో వారు ఆ కళాశాలల్లో చదివే విద్యార్థులను మరి దగ్గరుండి పరీక్షలు రాయిస్తున్నట్లు విద్యార్థులే చర్చించుకోవడం గమనార్హం.

సెల్ఫ్ సెంటర్లలో మాస్‌కాపీయింగ్..!

ఈ నెల 15నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం అధికారులు జిల్లాలో 30 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 13 ప్రభుత్వ కళాశాలలు, రెండు సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలు, ఐదు ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలు, ఒక మోడల్ స్కూల్, తొమ్మిది ప్రైవేట్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 9,392 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 9,793 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. కాగా, ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్ మినహా మిగతా చోట్ల సెల్ఫ్ సెంటర్లలోనే పరీక్షలు జరుగుతున్నాయి. ఆ కళాశాలల్లో బోధించే లెక్చరర్లు, ప్రిన్సిపాల్‌లు అక్కడే పరీక్షల విధులు నిర్వర్తించనుండడంతో జోరుగా మాస్‌కాపీయింగ్ జరగనుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులూ చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో కష్టపడి చదివిన విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది. తాంసి, తలమడుగు, నేరడిగొండ, నార్నూర్, బేల, బోథ్ తదితర కళాశాలల్లో 90 నుంచి 95 శాతానికిపైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఆదిలాబాద్ ప్రభుత్వ బాలికల కళాశాల, ప్రభుత్వ బాలుర కళాశాలల్లో కనీసం 50 శాతం మంది విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించడం లేదు. ఎందుకంటే ఈ మూడు చోట్ల జంబ్లింగ్ విధానం ఉండడంతో ఫలితాలు తక్కువగా వస్తున్నాయి. సెల్ఫ్ సెంటర్లలో మాస్‌కాపీయింగ్ కారణంగా ఉత్తీర్ణత శాతం పెరుగుతోంది. కాగా, అదే కళాశాలకు చెందిన విద్యార్థులకు వేరే కళాశాలకు చెందిన లెక్చరర్లతో ఇన్విజిలేషన్ విధులు కేటాయిస్తే ఫలితాలు మరోలా ఉండే అవకాశం లేకపోలేదు. పదో తరగతి, డిగ్రీ పరీక్షలకు వేరే లెక్చరర్లతో విధులు కేటాయించగా, ఇంటర్ పరీక్షలు మాత్రం ఇందుకు భిన్నంగా నిర్వహిస్తున్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం. ఈ నెల 15నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. నిబంధనల ప్రకారమే సీఎస్, డీవో, ఇన్విజిలేషన్ విధులు కేటాయించాం. అనారోగ్యం కారణంగా కొంతమంది సీఎస్, డీవో విధులకు హాజరుకావడం లేదు. సెల్ఫ్ సెంటర్లలో సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్‌లు సీఎస్‌గా, అక్కడ పని చేసే లెక్చరర్లకే ఇన్విజిలేషన్ విధులు కేటాయించాం. కానీ.. వారు బోధించే సబ్జెక్టుల పరీక్ష ఉన్నరోజు మాత్రం వారికి ఇన్విజిలేషన్ విధులు కేటాయించలేదు.

– రవీందర్‌కుమార్, డీఐఈవో

సంజయ్ వ్యాఖ్యలపై నిరసనలు



ఆదిలాబాద్‌టౌన్: ప్రధాని మోదీ, బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

- జిల్లా కేంద్రంలో ప్రధాని మోదీ, ఎంపీ సంజయ్ దిష్టిబొమ్మ దహనం
- ఇచ్చోడ మండల కేంద్రంలో రాస్తారోకో

ఆదిలాబాద్‌టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితపై చేసిన వ్యాఖ్యలపై నిరసనలు వెల్లువెత్తాయి. బీఆర్ఎస్ మహిళా విభాగం, జాగృతి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ చౌరస్తా వరకు ప్రధాని మోదీ, బండి సంజయ్ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. బండి సంజయ్ మహిళలను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి మోదీ ప్రభుత్వం ఓర్వలేకే ఈడీతో కేసులు బనాయిస్తూ కవితను ఇబ్బందుల పాలు చేస్తోందని ఆరోపించారు. బండి సంజయ్‌ను అరెస్ట్ చేసేవరకూ నిరసనలు, ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మహిళా విభాగం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు స్వరూపారాణి, బోడగం మమత, పట్టణాధ్యక్షుడు అజయ్, అష్రఫ్, కౌన్సిలర్ చందా నర్సింగ్, యువజన విభాగం అధ్యక్షుడు బుట్టి శివకుమార్, సాయి, ఇబ్రహీం, మహిళా నాయకులు ఫర్వీన్ సుల్తానా, కస్తాల ప్రేమల, అనసూయ పాల్గొన్నారు.

ఇచ్చోడ మండల కేంద్రంలో..

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు మాట్లాడారు. బండి సంజయ్ తీరు మార్చుకోకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను స్వార్థం కోసం వాడుకుంటోందని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకే తమ పార్టీ నాయకులపై దర్యాప్తు సంస్థలతో దాడులకు తెగబడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంజేశారు. ఇచ్చోడ, బోథ్, బజార్‌హత్నూర్, తాంసి, గుడిహత్నూర్ మండలాల పార్టీ కన్వీనర్లు కృష్ణారెడ్డి, నారాయణ్‌రెడ్డి, రాజారాం, నాగయ్య, కరాడ్ బ్రహ్మానందం, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాహెర్‌బిన్‌సలాం, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మాన్ సింగ్, నాయకులు గాడ్గే సుభాష్, అజీం సుల్తాన్, పురుషోత్తంరెడ్డి, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడ: రాస్తారోకోలో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు

'బండి'కి మహిళలే బుద్ధి చెబుతారు



పార్టీలో చేరినవారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి మహిళలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. పట్టణంలోని సంజయ్‌నగర్‌లో ఆదివారం 14వ వార్డు కౌన్సిలర్ బదాల సుజాతతో పాటు పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అంతకుముందు కాలనీలో రూ.30 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కౌన్సిలర్ సుజాత, కాలనీవాసులతో కలిసి భూమిపూజ చేశారు. ముందుగా కాలనీవాసులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని ఆరోపించారు. దేశంలో బీఆర్ఎస్‌కు లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే మోదీ ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితపై ఈడీని ఉసిగొల్పుతోందని విమర్శించారు. ఎన్ని కుయుక్తులు పన్నినా దేశంలో, రాష్ట్రంలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తంజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, రోకండ్ల రమేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, నాయకులు అజయ్, అష్రఫ్, బండారి సతీశ్, జోగు మహేందర్, బదాల సృజన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

రెండోరోజుకు ఆదివాసీల రిలే దీక్ష



దీక్ష శిబిరంలో కూర్చున్న ఆదివాసీలు

ఆదిలాబాద్‌రూరల్: ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మావల మండలం బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలోని సర్వే నంబర్ 72లో ఆదివాసీలు చేపట్టిన రిలే దీక్ష ఆదివారం రెండోరోజుకు చేరింది. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ మాట్లాడారు. రూ.కోట్ల విలువైన భూములను కబ్జా చేసిన బడాబాబులకు క్రమబద్ధీకరణ పేరిట దోచిపెడుతున్న ప్రభుత్వం ఇంటి స్థలాలు లేని సామాన్యులపై జులుం ప్రదర్శించడం దుర్మార్గమని విమర్శించారు. సొంత ఇళ్లు లేక గుడిసెలు వేసుకుని నివసిస్తుంటే అధికారులు వాటిని ఖాళీ చేయాలని హెచ్చరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం, అధికారులు ఎన్ని హెచ్చరికలు చేసినా ఇళ్ల పట్టాలిచ్చే వరకూ కదలబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉయికే సంజీవ్, గేడం కేశవ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న పార్థసారథి

ఆదిలాబాద్: జిల్లా స్థాయి ఖేలో ఇండియా వుమెన్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆదివారం ఉత్సాహంగా సాగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలను జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో సత్తా చాటి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీ రాజేశ్ మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి ఈ నెల 19వ తేదీన హైదరాబాద్‌లోని ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ అథ్లెటిక్స్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు వెల్లడించారు. జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ రాణించాలని సూచించారు. పెటా సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.స్వామి, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జ్యోతిస్వరణ్, పీఈటీలు వీజీఎస్ రాకేశ్, నరసమ్మ, ప్రియాంకారెడ్డి, మాజీద్ పాల్గొన్నారు.

నేడు దివ్యాంగుల బస్‌పాస్ మేళా

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం దివ్యాంగుల బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కే కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ జిరాక్స్ కాపీతోపాటు ఒరిజినల్, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో సంప్రదించాలని పేర్కొన్నారు. కార్డు ధర రూ.50 ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా సీవోఈ పరీక్ష



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్సీవో గంగాధర్

ఉట్నూర్: గురుకుల కళాశాలల్లో ప్రవేశాల కోసం ఉట్నూర్‌లో ఆదివారం నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆర్సీవో గంగాధర్ తెలిపారు. ఆయన పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు. 2,065 మంది విద్యార్థులు హాజరు కాగా, 177 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

రీజినల్ లెవెల్ వర్క్‌షాప్‌నకు సర్పంచులు

బోథ్: పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లోని ఐఈఏ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించనున్న రీజినల్ లెవెల్ వర్క్‌షాప్‌నకు బోథ్ మండలంలోని పట్నాపూర్ సర్పంచ్ పంద్రం గ్రామ సుగుణ, పిప్పల్‌ధరి గ్రామ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఒక్కరోజు జరిగే వర్క్‌షాప్‌లో పాఠశాల విద్య, గ్రామీణాభివృద్ధి, క్లస్టర్ అభివృద్ధిపై వీరు శిక్షణ ఇవ్వనున్నారు.

'కల్తీ కల్లు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి'



వివరాలు తెలుసుకుంటున్న భుజంగ్‌రావు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని చిన్నసుద్దగూడ గ్రామానికి చెందిన మొహాపత్ ఇటీవల కల్తీ కల్లు తాగి మృతి చెందగా అతడి కుటుంబాన్ని ఆదివారం మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావు, బృందం సభ్యులు పరామర్శించారు. అనంతరం భుజంగ్‌రావు మాట్లాడుతూ.. మహాపత్ మృతికి బాధ్యులైన అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటివరకు కల్తీ కల్లు బారిన పడి 11 మంది మరణించడానికి ఎక్సైజ్ అధికారులను బాధ్యులను చేయాలని విజ్ఞప్తి చేశారు. కల్తీ కల్లు తయారు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు, ఐదెకరాల భూమి ఇప్పించాలన్నారు. 11 మంది మృతుల కుటుంబాలను గిరిజన సంక్షేమ, రెవెన్యూ శాఖలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు అతీశ్, ప్రధాన కార్యదర్శి సుగుణక్క, రఘునంద రెడ్డి, గోపీనాథ్, గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నేతావత్ రాందాస్, వెడ్మ శ్యాంరావు, వెడ్మ జంగు, జ్ఞానేశ్వర్ తదితరులున్నారు.

ఆదివాసీ గ్రామాలకు రాయిసెంటర్ 'సుప్రీం'

- కేంద్రంలో అన్ని సమస్యలకు పరిష్కారం
- ఐటీడీఏ చైర్మన్ కనక లక్కేరావు
- ముగిసిన జిల్లా కమిటీ సభ్యుల శిక్షణ

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీ గ్రామాలకు రాయి సెంటర్ సుప్రీం కోర్టు లాంటిదని ఐటీడీఏ చైర్మన్ కనక లక్కేరావు పేర్కొన్నారు. కెరమెరి మండలం జోడేఘాట్‌లోని కుమురంభీం మ్యూజియంలో రెండురోజులుగా ఆదిలాబాద్ రాయిసెంటర్ సార్‌మెడి జిల్లా కమిటీ సభ్యులకు ఇస్తున్న శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా లక్కేరావు మాట్లాడుతూ.. గతంలో మాదిరి గ్రామాల్లో చిన్నచిన్న గొడవలు, ఇంటి, కుటుంబ సమస్యలు రాయిసెంటర్ల ఆధ్వర్యంలోనే పరిష్కారం కావాలని తెలిపారు. కాలగర్భంలో కలిసిపోతున్న గిరిజన చట్టాలు, హక్కులను కాపాడడంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. 1/70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేసేందుకు కృషి చేయాలని, పేద ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందేలా చూస్తూ.. సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. భూములు ఇతరులకు కౌలుకు ఇవ్వకుండా దున్నుకోవాలని పిలుపునిచ్చారు. గూడేల్లో ప్రతీ కార్యక్రమం ఇక నుంచి రాయిసెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించారు. జిల్లా సార్‌మెడి మెస్రం దుర్గు, ఆర్పీ శివరామకృష్ణ, పీటీజీ ఏపీవో ఆత్రం భాస్కర్, పెసా కోఆర్డినేటర్ అర్క వసంత్‌రావు, నాయకులు తొడసం చందు, పెందోర్ గోపి, సిడాం అర్జు, మోతీరాం, దేవ్‌రావు, సోనేరావు, భగవాన్‌షా, తుకారాం, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కనక లక్కేరావు

మహిళల ఆరోగ్యంపై అవగాహన సదస్సు



డాక్టర్ అల్కేను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఆదిలాబాద్‌రూరల్: సమతా సైనిక్‌దళ్, మాత రమాబాయి మహిళా సంఘం ఆధ్వర్యంలో సంజయ్‌నగర్‌లోని బుద్ధ విహార్‌లో ఆదివారం మహిళల ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ అల్కా గావలే హాజరై మాట్లాడారు. మహిళలు క్యాన్సర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. అతి తక్కువ వయస్సులోనే మహిళలకు గర్భసంచి తీసేయాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయని తెలిపారు. దీని నివారణకు పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అంతకు ముందు అంబేద్కర్, బుద్ధుడి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్కాతో పాటు కల్పన దావర్కర్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. సమతా సైనిక్ దళ్, రమాబాయి మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ వాఘ్మారే, సమతా సైనిక్‌దళ్ మహిళా రెజిమెంట్ బౌధిక్ ప్రముఖ్ ఆశ్వినీ కళంకార్, దయాబాయి హుక్కై, కరుణ నిమ్ సర్కార్, వైజయంతి కానిందే, జిల్లా సంఘటకులు మార్షల్ విశ్వభూషణ్ వాఘ్మారే, సహ సంఘటకులు మార్షల్ రమాకాంత్ కాంబ్లే, రవిచంద్ర జాబాడే, హర్షవర్ధన్ వాఘ్మారే తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బైల్‌బజార్ ప్రాంతంలో పేకాటస్థావరంపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించగా, పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.10,460 వేల నగదు, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

శనగ రైతులకు కుచ్చుటోపీ



పోలీస్‌స్టేషన్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న రైతులు (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని కుప్టి, కుమారి గ్రామాల రైతుల నుంచి సుమారుగా వెయ్యి క్వింటాళ్ల శనగ పంటను ఇద్దరు వ్యాపారులు రెండేళ్ల క్రితం కొనుగోలు చేసి రైతులకు రూ.54లక్షల పైచిలుకు కుచ్చుటోపీ వేశారు. అయితే సంవత్సరాల తరబడి రైతులకు డబ్బులు ఇవ్వకపోవడంతో వారు రెండు రోజుల క్రితం నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివాసీ జనసంరక్షణ వెల్ఫేర్ సొసైటీ పేరుతో శనగ కొనుగోళ్లను జైనూర్ మండలం ఊసగావ్‌కు చెందిన సోయం రవీందర్, మధ్యవర్తిగా బోథ్ మండలం ధన్నూర్ గ్రామానికి చెందిన సంగెపు బొర్రన్న ఉండడంతో ఈ శనగ పంటను విక్రయించినట్లు రైతులు పేర్కొన్నారు. 15 రోజుల్లోగా డబ్బులు ఇస్తామంటేనే శనగ పంటను విక్రయించామని, ఇప్పటివరకు ఇవ్వకపోవడంతో ఇటీవల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఒత్కులపల్లి గ్రామానికి చెందిన కోగిల సమ్మక్క(45) మహిళ శనివారం రాత్రి విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. సమ్మక్క ఇంటిలో టీవీ ఆన్ చేయడానికి ఇంటి ముందు కిటికి పక్కన గోడకు ఉన్న ప్లగ్ బాక్సుకు టీవీ ప్లగ్ పెడుతున్న క్రమంలో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త మల్లయ్యతో పాటు కుమారుడు ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎల్లక్కపేటలోని చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సూర్యప్రకాశ్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బెజ్జూర్: బైక్‌పై నుంచి కిందపడి యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని సోమిని గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్ వివరాల ప్రకారం... కొర్తే మోహన్(20) అందుగులగూడ గ్రామంలోని ఓ శుభకార్యానికి బైక్‌పై బయలుదేరాడు. ఆ గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి గుంతలో పడ్డాడు. గుంతలోని బండరాళ్లు తలకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఏడు నెలల బాలుడు, భార్య ఉన్నారు.

'గురుకులం'లో ప్రవేశాలు



సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

- ఈ నెల 16 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 5వ తరగతిలో ప్రవేశాలు
- ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష
- ఆదిలాబాద్ రీజియన్‌లో 17 గురుకులాలు, 1,360 సీట్లు

ఆదిలాబాద్ రీజియన్‌లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు	: 17
5వ తరగతిలో ప్రవేశాలకు ఒక్కో పాఠశాలలో 80 సీట్ల చొప్పున	: 1,360

మంచిర్యాలటౌన్: కేజీ టు పీజీ ఉచిత విద్యలో భాగంగా ఏర్పాటు చేసిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి గత నెలలోనే ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించి ఈ నెల 6వ తేదీ వరకు చివరి తేదీగా నిర్ణయించగా విద్యార్థుల సౌకర్యార్థం గడువును ఈ నెల 16వ తేదీ వరకు పొడిగించారు. ఇంగ్లిషు మీడియంలో విద్యా బోధనను విజయవంతంగా కొనసాగిస్తున్న గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలను పొందేందుకు విద్యార్థులు ఆసక్తిని చూపిస్తున్నారు. గత నెల 9వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉంది.

ఆదిలాబాద్ రీజియన్‌లో 17 పాఠశాలలు...

ఆదిలాబాద్ రీజియన్‌లోని ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో 17 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలున్నాయి. 5వ తరగతిలో 80 సీట్ల చొప్పున ప్రవేశాలను జరుపుతుండగా, మొత్తం 1,360 సీట్లు ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధనతో పాటు, భోజన వసతి, సకల సదుపాయాలు కల్పించనున్నారు. మొత్తం 80 సీట్లకు ఎస్సీలకు 60, కన్వర్టెడ్ క్రిస్టియన్‌లకు 2, ఎస్టీలకు 5, బీసీలకు 10, మైనారిటీలకు 2, ఓసీ/ఓబీసీలకు 1 సీటును కేటాయిస్తారు. ఆయా పాఠశాలల్లో ఒక్కోసారి ప్రవేశం పొందితే 10వ తరగతి వరకు ఉచితంగా చదువు, హాస్టల్ వసతితో పాటు, అన్ని రకాల వసతులను కల్పించడం, పుస్తకాలు, బట్టలు, కాస్మొటిక్ చార్జీలను అందిస్తారు. ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్ గర్ల్స్, బోథ్ గర్ల్స్, ఇచ్చోడలో బాయ్స్ గురుకులాలు ఉన్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆసిఫాబాద్ బాయ్స్, సిర్పూర్(టి) బాయ్స్, సిర్పూర్(టి) గర్ల్స్, కాగజ్‌నగర్ గర్ల్స్, రెబ్బెన గర్ల్స్ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలో లక్సెట్టిపేట్ గర్ల్స్, చెన్నూరు గర్ల్స్, జైపూర్ బాయ్స్, కోటపల్లి బాయ్స్, మంచిర్యాల బాయ్స్, మందమర్రి గర్ల్స్, బెల్లంపల్లి బాయ్స్(సీఈవో), బెల్లంపల్లి గర్ల్స్, కాసిపేట బాయ్స్ ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు

సాంఘిక గురుకుల సంక్షేమ పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులు కేవలం ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసంwww.tswreis.ac.in, http:/tgcet.cgg.gov.in, http:/tgtwgurukulam.telangana.gov.in వెబ్‌సైట్‌లలో ఈ నెల 16వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. దరఖాస్తుకు రూ.100 చెల్లించడంతో పాటు, ఒక ఫోన్ నంబరుతో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవచ్చు. వేరే వారి ఫొటోలు పెట్టి దరఖాస్తు చేస్తే వారిపై చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకుంటారు. దరఖాస్తుదారులకు ఏవైనా సందేహాలు ఉంటే హెల్ప్‌లైన్ నంబర్ 1800 425 45678, 040–24734899, 9121174434 లేదా ప్రాస్పెక్టస్‌లో పేర్కొన్న సంబంధిత గురుకుల పాఠశాలల ప్రదానోపాధ్యాయులను ఫోన్‌లో సంప్రదించవచ్చు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు2022–23 విద్యాసంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న వారు మాత్రమే అర్హులు, ప్రవేశపరీక్షను ఏప్రిల్ 23వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహిస్తారు.

ఇవీ ప్రత్యేకతలు..

- సన్నబియ్యంతో సహా అన్ని పోషక విలువలు ఉన్న రుచికరమైన ఆహారం.
- పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా సరఫరా.
- విద్యార్థులకు స్టేషనరీ (పెన్సిల్, రికార్డు పుస్తకాలు వంటివి) ఉచితం.
- మూడు జతల స్కూల్ యూనిఫాం, ట్రంకు బాక్సులు సరఫరా
- పీ.టి. డ్రెస్, ట్రాక్ సూట్, స్పోర్ట్స్ షూ, సాక్స్, నైట్ డ్రెస్, ప్లేట్, గ్లాస్, కటోర, స్పూన్, బెడ్‌షీట్, బ్లాంకెట్, పరుపులు ఉచితంగా సరఫరా.
- విద్యార్థులకు సబ్బులు కొనేందుకు డబ్బుల పంపిణీ.
- నెలలో నాలుగుసార్లు చికెన్, రెండుసార్లు మటన్‌తో భోజనం.
- వారంలో నాలుగు రోజులు కోడిగుడ్లు, ఆరు రోజులు పండ్లు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఈ నెల 16వ తేదీ వరకు స్వీకరిస్తారు. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నాణ్యమైన భోజనం అందించడంతో పాటు, ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని 17 గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు చేసుకునేందుకు అవకాశం ఉంది.

– కొప్పుల స్వరూపారాణి, గురుకుల విద్యాలయాల ఆదిలాబాద్ రీజినల్ కోఆర్డినేటర్

'అడెల్లి'కి పోటెత్తిన భక్తులు



ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

సారంగాపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాక మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సారంగాపూర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తల్లిదండ్రుల పేరు నిలబెట్టారు

- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



స్వాగత తోరణం ప్రారంభిస్తున్న మంత్రి

లక్ష్మణచాంద: తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల కోసం గ్రామం వద్ద స్వాగత తోరణం ఏర్పాటు చేసి వారి పేరును నిలబెట్టారని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోన్ మండలం సాకెర గ్రామానికి చెందిన విశ్రాంత తహసీల్దార్ సక్కాని సువర్ణ లక్ష్మి–గంగారంల జ్ఞాపకార్థంగా కుమార్తె భవాని–అల్లుడు శంకర్‌లు ఏర్పాటు చేసిన స్వాగత తోరణాన్ని ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఎప్పటికీ మర్చిపోవద్దన్నారు. పిల్లల ఉన్నతి కోసం వారు ఎన్నో త్యాగాలు చేస్తారని, వృద్ధాప్యంలో వారికి అండగా ఉండి సేవలందించాలన్నారు. సోన్ జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నాబావుసాఠె ఆదర్శప్రాయుడు

- ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జెడ్పీ చైర్మన్లు జనార్దన్, కోవలక్ష్మి
- నార్నూర్‌లో అన్నాబావుసాఠె విగ్రహం ఆవిష్కరణ
- సొంత నిధులతో ఏర్పాటు చేయించిన సర్పంచ్ గజానంద్



అన్నాబావుసాఠె విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

నార్నూర్: సాహితీ రత్న డాక్టర్ అన్నాబావుసాఠె ఆదర్శప్రాయుడని, ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, కుమురంభీం ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. నార్నూర్ మండల కేంద్రంలో సర్పంచ్ గజానంద్‌నాయక్ సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన అన్నాబావుసాఠె విగ్రహాన్ని ఆదివారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. మహనీయుల చరిత్రలు తెలుసుకుని వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ప్రతీ కుటుంబంలో పిల్లల చదువుకునేలా చూడాలన్నారు. అన్నివర్గాల ప్రజలు ఐక్యంగా ఉంటేనే సమాజం, గ్రామం అభివృద్ధి చెందుతుందని వివరించారు. అనంతరం లంబాడా సంప్రదాయ దుస్తులతో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మిని గిరిజన మహిళలు సన్మానించారు.

గిరిజనేతరుల సమస్యలు పరిష్కరిస్తాం

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతరులకు ప్రభుత్వ పథకాలు, పంట రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని దళిత నేతలు జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో నివాసముంటున్న దళితుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని వివరించారు. సీఎం కేసీఆర్, సీఎస్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో మతాంగ్ ఋషి సంస్థాన్ పీఠాధిపతి గజానంద్ మౌలి, ఎంపీపీ కనక మోతుబాయి, సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, కుమురంభీం జిల్లా గ్రంథాలయశాఖ చైర్మన్ కనక యాదవ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, గాదిగూడ వైస్ ఎంపీపీ యోగేష్, ఎంపీటీసీ పరమేశ్వర్, అన్నాబావుసాఠె కమిటీ జిల్లా అధ్యక్షుడు కాంబ్లె ఉదయ్, మండల అధ్యక్షుడు కొరెళ్ల మహేందర్, కార్యదర్శి బర్‌కుంబే రాజు, దళిత నాయకులు భారత్ వాఘ్మారే, నర్సింగ్‌మోరే, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు యునుస్ అక్బానీ ఉన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మిని సన్మానిస్తున్న లంబాడీ గిరిజన మహిళలు

ఉచిత శిక్షణ.. ఉపాధికి భరోసా

- నిరుద్యోగ మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ
- నాలుగేళ్లల్లో 50వేల మందికి..
- పలు రంగాల్లో ఉపాధి పొందుతున్న మహిళలు

జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో...
- 2019 నుంచి 2022 వరకు 50వేల మందికి
- నాలుగేళ్లలో 12మండలాల్లో పూర్తి
- ఈ ఏడాది 6 మండలాల్లో 1800 మందికి శిక్షణ
- ఇప్పటి వరకు శిక్షణ పొందిన 500మందికి బ్యాంకుల ద్వారా రుణాలు



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు జ్ఞానేశ్వరి. జన శిక్షణ సంస్థలో బ్యూటీషన్‌గా మూడు నెలల పాటు శిక్షణ తీసుకుంది. ప్రస్తుతం మండల కేంద్రంలోని బ్యూటిషన్ శిక్షకురాలిగా శిక్షణ పొందిన సంస్థలోనే పనిచేస్తూ నెలకు రూ.9వేలు సంపాదిస్తోంది. అలాగే ఇతర సమయాల్లో సొంతంగా బ్యూటిషన్‌గా పనిచేస్తోంది.



ఇచ్చోడలో నిరుద్యోగ మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఇచ్చోడ: జిల్లాలో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ పలు రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని జన శిక్షణ సంస్థ. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి వారికి స్వయం ఉపాధి వైపు అడుగులు వేసేలా కృషి చేస్తోంది. జన శిక్షణ సంస్థ కేంద్ర ప్రభుత్వ వృత్తి నైపుణ్యత అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నాలుగేళ్లలో నార్నూర్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, జైనథ్, బేల మండలాల్లో 50వేల మంది మహిళలకు శిక్షణ అందచేశారు.

ఈ ఏడాది ఆరు మండలాల్లో ...

ఈ ఏడాది తాంసి, తలమడుగు, బజార్‌హత్నూర్, బోథ్, ఇచ్చోడ, ఆదిలాబాద్ మండలాల్లో 90బ్యాచ్‌లుగా విభజించి బ్యాచ్‌కు 20మంది అభ్యర్థుల చొప్పున 18 వందల మందికి శిక్షణ ఇస్తున్నారు. 90రోజుల పాటు శిక్షణ ఇచ్చి అనంతరం వారికి గుర్తింపు పత్రాలను అందచేస్తున్నారు.

శిక్షణ కోర్సులు...

నిరుద్యోగ, నిరక్షరాసులైన 15 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారికి బ్యూటిషన్, డ్రెస్‌మేకింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, జూట్ స్టిచ్చింగ్, ఎలక్ట్రిషన్ కంప్యూటర్, బాంబు బాస్కెట్ మేకర్ (వెదురు బొంగులతో తయారు చేసే వస్తువులు), ఫుడ్ ప్రాసెసింగ్, ఉలెన్‌వర్క్, కారు డ్రైవింగ్‌లో ప్రతీరోజు మూడు గంటల పాటు శిక్షణను ఇస్తున్నారు.

బ్యాంకుల ద్వారా రుణాలు

శిక్షణ పూర్తయ్యాక అభ్యర్థుల ప్రామాణికంపై గ్రేడింగ్ తీస్తారు. ఏ గ్రేడ్ పొందిన వారికి బ్యాంకుల ద్వారా జన శిక్షణ సంస్థ అందచేసిన శిక్షణ ధ్రువపత్రాల ద్వారా సొంతంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి రూ.50వేల నుంచి రెండున్నర లక్షల వరకు రుణాలు ఇప్పిస్తున్నారు.

మహిళలు ముందుకు రావాలి



జిల్లాలో ఇప్పటి వరకు 50వేల మందికి వివిధ రంగాల్లో శిక్షణ పూర్తిచేశాం. ఇంకా మహిళలు ఈ శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. జన శిక్షణ సంస్థ ద్వారా శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారు.

– శ్యామల , జన శిక్షణ సంస్థ డైరెక్టర్

దోషులను కఠినంగా శిక్షించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ముథోల్ సీఐ వినోద్‌రెడ్డి

లోకేశ్వరం: మండలంలోని బామ్నికేలో బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పేడకొట్టి అవమానపర్చిన దోషులను కఠినంగా శిక్షించాలని వీడీసీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం తెల్లవారుజాము పేడ మరకలతో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని చూసి గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ముథోల్ సీఐ వినోద్‌రెడ్డి, లోకేశ్వరం ఎస్సై సాయికుమార్‌లు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. దోషులను పట్టుకుని వారిపై చట్టారీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ సునీత, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు.



బామ్నికేలో అంబేద్కర్ విగ్రహానికి పేడ మరకలు

పిచ్చికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

నెన్నెల: మండలంలోని మైలారంలో ఆదివారం పిచ్చికుక్కల దాడిలో ముగ్గురు గాయాలపాలయ్యారు. ఎస్సీవాడలో ఇంటి ముందు ఆడుకుంటున్న వేల్పుల ప్రణీత్(5)పై కుక్క దాడి చేయగా అతడిని కాపాడేందుకు వెళ్లిన లింగంపల్లి నీరజను తీవ్రంగా గాయపర్చింది. వీరితో పాటు బాలవోనివాడలో పోల్క చరణ్ పిచ్చికుక్కల దాడిలో గాయపడ్డాడు. దీంతో వారిని నెన్నెల పీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించారు. ఒకేరోజు ముగ్గురిపై దాడి చేయడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పొలాలకు వెళ్లే రైతులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు జంకుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే పిచ్చికుక్కల బెడదను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఆలయంలో ఎమ్మెల్యే జోగురామన్న కుటుంబీకులు



అక్షరాభ్యాస మండపంలో ఎమ్మెల్యే జోగు రామన్న కుటుంబీకులు



పూజల్లో పాల్గొన్న వరంగల్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, వరంగల్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కుటుంబ సమేతంగా ఆదివారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న మనుమరాలు మహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా కుటుంబీకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఎమ్మెల్యే జోగు రామన్నను ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కలిసి శాలువాతో సత్కరించారు.